నమస్తే తెలంగాణ

ఖమ్మం

3 | ఖమ్మం, బుధవారం 9 అక్టోబర్ 2024 | KHAMMAM


## 11న 'ఇంటిగ్రేటెడ్' భవన నిర్మాణాలకు శంకుస్థాపన

### ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

బోనకల్లు, అక్టోబర్ 8: రాష్ట్ర ప్రభుత్వం మధిర, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణాలకు ఈ నెల 11న శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం గోవిందాపురం-ఎల్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ స్థలాన్ని కలెక్టర్.. ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణం కోసం 25 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఆర్అండ్‌బీ, విద్యా శాఖ, రెవెన్యూ శాఖల సమన్వయంతో మూడు చోట్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు.



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రెవెన్యూ అధికారులు గుర్తించిన స్థలానికి చుట్టూ పెన్సింగ్ వేస్తామని, స్థలాల ఎంపిక విషయంలో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. శంకుస్థాపనకు సంబంధించి పైలాన్ నిర్మాణం, సభ ఏర్పాట్ల బాధ్యతను ఆర్అండ్‌బీ అధికారులు తీసుకోవాలని ఆదేశించారు. శంకుస్థాపన కార్యక్రమానికి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసి తరలించే బాధ్యతను డీఈవో తీసుకోవాలన్నారు. స్థానికులను కూడా ఎక్కువగా సమీకరించి శంకుస్థాపన కార్యక్రమం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఈఈ తానేశ్వర్, డీఈవో సోమశేఖర శర్మ, డీఈఈ శంకర్‌రావు, తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో రవికుమార్, ఎంపీవో కోటేశ్వరశాస్త్రి, ఏఈలు రాంబాబు, శ్రీకాంత్, ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్, ఎంఈవోలు వై.ప్రభాకర్, దామాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పత్తి దళారులు రెడీ


భూతల్లిని నమ్ముకొని ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతన్నల మెడపై దళారుల కత్తి ఎప్పుడూ వేలాడుతూనే ఉంటున్నది. సీజన్ ప్రారంభం నుంచీ అన్నదాతలను అన్నిరకాలుగా మోసం చేసేందుకు దళారులు సిద్ధంగా ఉంటారు. ప్రస్తుతం పత్తి పంట చేతికొచ్చే సమయం కావడంతో ప్రైవేట్ వ్యాపారులు గ్రామాల్లో తిష్ట వేసేందుకు రెడీ అవుతున్నారు. ఈ ఏడాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,01,216 ఎకరాల్లో పత్తి పంట సాగు కాగా.. దిగుబడి 16 లక్షల మెట్రిక్ టన్నులు రానున్నట్లు అధికారుల అంచనా. అయితే ఇందులో సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం 6 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేయనుండడంతో 'ప్రైవేట్ రాజ్యం' కొనసాగనున్నది. ప్రభుత్వమే సరిపడా కొనుగోలు కేంద్రాలు పెట్టి మద్దతు ధరకు మొత్తం పంటను కొనుగోలు చేస్తే రైతన్నలు మోసపోయే పరిస్థితి ఉండదని పలువురు రైతు నాయకులు అభిప్రాయపడుతున్నారు.

*- భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ)*



గత ఏడాది జూలూరుపాడులో లోడింగ్ అవుతున్న పత్తి (ఫైల్)

- త్వరలో చేతికిరానున్న 'తెల్ల బంగారం'
- గ్రామాల్లో తిష్ట వేయనున్న ప్రైవేట్ వ్యాపారులు
- ఏటా తీవ్రంగా నష్టపోతున్న రైతన్నలు
- భద్రాద్రి జిల్లాలో నాలుగు సీసీఐ కేంద్రాలు
- ఈ ఏడాది 2,01,216 ఎకరాల్లో పత్తి సాగు
- దిగుబడి అంచనా 16 లక్షల మెట్రిక్ టన్నులు
- సీసీఐ కొనుగోలు చేసేది 6 లక్షల మెట్రిక్ టన్నులే..



రైతులు నానాకష్టాలు పడి పండిస్తున్న పత్తి పంటపై ప్రతి యేటా దళారులు మాటు వేసి వారి కష్టాన్ని దోచుకుంటున్నారు. ఏకంగా ఇంటికెళ్లి మరీ పత్తిని కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాంటా తూకం పేరుతో, తరుగు పేరుతో మోసాలకు పాల్పడుతూ రైతులను నిలువునా ముంచుతున్నారు. ప్రతి ఏడాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 లక్షల ఎకరాలకు పైగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా 2,01,216 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా 16 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. దీంతో ఇప్పటినుంచే దళారులు పత్తిని కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పత్తి సాగు కావడంతో.. దిగుబడి సైతం అదేస్థాయిలో వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దసరా తర్వాత కొన్ని ఏరియాల్లో పత్తితీతకు వచ్చే అవకాశాలు ఉన్నందున సీసీఐ ముందుగానే కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురానున్నది. ఈ నెల చివరికల్లా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు మార్కెటింగ్, వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందుకుగాను నిబంధనలను తయారు చేసింది.

### జిల్లాలో నాలుగుచోట్ల కొనుగోళ్లు..

పత్తిపంటను అమ్ముకునేందుకు రైతన్నలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో నాలుగు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే జిన్నింగ్ మిల్లుల వద్ద సంబంధిత యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. జిల్లాలోని మంజిత్ కాటన్ మిల్లు సుజాతనగర్, శ్రీలక్ష్మి కాటన్ మిల్లు కారేపల్లి, శ్రీరామ కాటన్ మిల్లు అశ్వాపురం, అనుశ్రీ ఇండస్ట్రీస్ లక్ష్మీపురం ఏరియాల్లో కొనుగోలు చేయనున్నారు. దళారుల బారిన పడకుండా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పంటల వద్దనే తేమ శాతం తెలిపే యంత్రాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పత్తి కూపన్లు కూడా ఇస్తున్నారు. పత్తి క్వింటాకు రూ.7,521గా మద్దతు ధరను ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

### ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు

పత్తి పంటను విక్రయించే రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ప్రతి రైతు ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా నెంబర్‌తోపాటు వేలిముద్రలను ప్రామాణికంగా తీసుకుంటారు. దీనివల్ల ఎవరి పంటను వారే విక్రయాలు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇందుకోసం మార్కెటింగ్ శాఖ నిబంధనలను ఖరారు చేసింది. విక్రయించిన పత్తి సొమ్ములు ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.





### దసరా తర్వాతే కొనుగోళ్లు..

జిల్లాలో ఈ ఏడాది పత్తి పంటను కొంచెం ఎక్కువగా సాగు చేశారు. సీసీఐ నాలుగు చోట్ల కేంద్రాలను అందుబాటులో ఉంచింది. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. ఆధార్ నెంబర్‌ను ఎన్‌రోల్ చేసుకొని విక్రయాలు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. రూ.7,521గా ప్రభుత్వం గిట్టుబాటు ధరను ప్రకటించింది. బ్యాంకు ఖాతాను ఆధార్ నెంబర్‌తో లింక్ చేసుకోవాలి. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాం. సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయాలు చేసుకోవాలి.

**– నరేందర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం**

## బాలికలకు ఇబ్బంది లేకుండా చూడాలి

### భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశం

పాల్వంచ, అక్టోబర్ 8: వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న బాలికలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. పాల్వంచ బొల్లోరుగూడెంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. రెండు వసతి గృహాల్లోని గదుల్లో కలియతిరిగి అక్కడి వసతులను పరిశీలించారు. వసతి గృహాల్లోని భవనానికి ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉందా.. అని వాకబు చేశారు. కొన్ని భవనాలు అక్కడక్కడా కురుస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని వార్డెన్లకు సూచించారు. అనంతరం కిన్నెరసాని ప్రాజెక్టును కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాకునాయక్, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్లు మహబూబీ, పద్మ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

## నాణ్యమైన విద్యకు మోడల్‌గా తెలంగాణ

- 15 రోజులకోసారి జిల్లా అధికారులు వసతి గృహాల్లో బస చేయాలి
- సమీక్షలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

మామిళ్లగూడెం, అక్టోబర్ 8: నాణ్యమైన విద్యకు మోడల్‌గా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల్లో అభివృద్ధి పథకాలు, వరద సహాయక చర్యలపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నదని, ఇందుకోసం పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించడానికి చర్యలు చేపడుతున్నదని అన్నారు. జిల్లా అధికారులు ప్రతి 15 రోజులకోసారి సంక్షేమ వసతి గృహాల్లో రాత్రి బస చేయాలన్నారు. త్వరలో హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని, ఈ విషయంలో తేడా వస్తే వార్డెన్‌ను బాధ్యులను చేయడంతోపాటు సంబంధిత జిల్లా అధికారిపై చర్యలు ఉంటాయన్నారు. రెండు నెలల క్రితం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని, ప్రతి నియోజకవర్గంలో భవన నిర్మాణాలకు భూసేకరణ చేయాల్సి ఉండగా.. 20 పాఠశాలలకు మాత్రమే ప్రతిపాదనలు వచ్చాయని, మిగతా చోట్ల త్వరగా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. హైవేల నిర్మాణ క్రమంలో స్థానిక రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, రోడ్డు ప్రమాదాల్లో స్థానికులు ప్రాణాలు కోల్పోతున్నారని, హైవే నిర్మాణ సంస్థల నుంచి నిధులు తెప్పించి దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్తగా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడతామని తెలిపారు. భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లిందని, అధికారులు ఎంతో శ్రమించి పునరుద్ధరణ పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించారన్నారు. సమీక్షలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

## ధాన్యలక్ష్మిగా అమ్మవారు

### కనుల పండువగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

భద్రాచలం, అక్టోబర్ 8: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలోని లక్ష్మీతాయారు అమ్మవారు మంగళవారం ధాన్యలక్ష్మీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఐదు రోజులుగా కనుల పండువగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా అర్చకులు అమ్మవారికి స్నపన తిరుమంజనం గావించి.. ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. చిత్రకూట మండపంలో రామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.



భద్రాచలం రామాలయంలో ధాన్యలక్ష్మీ అవతారంలో దర్శనమిస్తున్న లక్ష్మీతాయారు అమ్మవారు

**ధాన్యలక్ష్మీ అమ్మవారి విశిష్టత**

'ధన, ధాన్యకరీం సిద్ధిం అంటూ కీర్తిస్తుంది పురాణం. అన్ని రకాల ధాన్యాలను ప్రసాదించేది ఈ అమ్మేనని, అమ్మను ఆరాధిస్తే ఇతి బాధలన్నీ తొలగిపోయి సమయానికి వర్షాలు కురిసి దేశం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉంటుంది' అని పండితులు చెబుతున్నారు. ధాన్యలక్ష్మీ అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటే అన్ని బాధలు తొలగిపోతాయని, సుఖసంతోషాలతో జీవిస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలో సుందరకాండ పారాయణం నిర్వహించారు.

**నేడు విజయలక్ష్మీ అవతారం**

భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలోని ఉప ఆలయంలో లక్ష్మీ తాయారు అమ్మవారు బుధవారం విజయలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## 10 నుంచి ఖమ్మం మార్కెట్‌కు సెలవులు

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 8 : సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న దుర్గాష్టమి, 11న మహార్నవమి, 12న విజయదశమి, 13న ఆదివారం సెలవు దినం కావడంతో సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. 14 నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని, దీనికి రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కుల వృత్తులను ప్రోత్సహిస్తాం

- పాలేరులో చేపలతోపాటు రొయ్యలనూ పెంచుతాం
- వరదలకు నష్టపోయిన మత్స్యకారులను ఆదుకుంటాం
- ఉచిత చేప పిల్లల పంపిణీలో మంత్రి పొంగులేటి

కూసుమంచి, అక్టోబర్ 8: కుల వృత్తులను ప్రోత్సహిస్తే అనేక లక్షల కుటుంబాలకు ఉపాధి కలుగుతుందనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పాలేరు రిజర్వాయర్‌లో ఇటీవల వరదలతో నష్టపోయిన మత్స్యకారుల కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. ఇది మంచినీటి చెరువు కావడంతో ఇందులో చేపలతోపాటు రొయ్యల పెంపకానికి కూడా అవకాశం ఉందని అన్నారు. అందువల్ల రొయ్య పిల్లలు కూడా పోసి ఎక్కువ ఆదాయాన్ని పొందే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.



పాలేరు రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదులుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాష్ట్ర మత్స్య అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అధ్యక్షతన పాలేరు రిజర్వాయర్‌లో మంగళవారం జరిగిన చేప పిల్లల విడుదల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జలాశయంలో చేపపిల్లలను వదిలిన అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఇటీవలి వరదలకు తెప్పలు, వలలు నష్టపోయిన మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రకృతి విపత్తుల నిధులు ఎలా కేటాయించాలనే విషయంపై మత్స్యశాఖ కమిషనర్‌తో చర్చించి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పాలేరులో ప్రస్తుతం 7 లక్షల చేప పిల్లలు వదులుతున్నామని, ఇంకా కావాలని అడుతున్నందున మిగిలిన వాటిని కూడా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయా సమస్యలను పలువురు మత్స్యకారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. పాలేరు మత్స్య సంపదకు పూర్వ వైభవం తెస్తామని అన్నారు. మత్స్యశాఖ చైర్మన్ సాయికుమార్ మాట్లాడుతూ అవకాశం ఉన్న ప్రతిచోటా చేపల పెంపకానికి చర్యలు చేపడతామని అన్నారు. ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, అడ్‌హక్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, పాలేరు మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు ఇస్లావత్ ఉపేందర్, జిల్లా అధికారి శివప్రసాద్ తదితరులు ప్రసంగించారు. కాగా, ఎనిమిదేళ్లుగా ఎన్నికలు జరగని పాలేరు మత్స్యకారుల సంఘానికి ఇప్పుడైనా ఎన్నికలు జరపాలని కోరుతూ మత్స్యకారులు మంత్రికి వినతిపత్రం అందించారు. దళారులను రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, మత్స్యకారుల్లోని వర్గపోరు సభలో కనిపించింది.